



ఆ సందులో గది అద్దెకు తీసుకుని ఇంకా వారంరోజులయినా కాలేదు. అప్పుడే దాసు ఆ సందులోని వాళ్ళగురించి. చుట్టుప్రక్కల వాళ్ళ గురించి ఆరాతీయడం ప్రారంభించాడు. అందరి సంగతులూ దాసుకి కావాలి. అందుకే నాకు దాసు అంటే అసహ్యం. దాసుకి ఇతరుల విషయాలంటే, ముఖ్యంగా స్వంత విషయాలంటే ఆసక్తి ఎక్కువ. అవి సేకరించడం ఒక హాబీ అయిపోయింది దాసుకి. వాళ్ళని గురించి వీళ్ళని గురించి వాళ్ళనీ అడిగి సంతోషపడుతూంటాడు.

ఆ తెలుసుకున్న విషయాలు ఇతరులతో చెప్తేగాని తృప్తి ఉండదు దాసులాంటి వాళ్ళకి. ఎప్పటికప్పుడు నాకు ఆ సందులో వాళ్ళ గురించి చెప్ప సాగాడు. నాకు వినడానికి ఇష్టం లేకపోయినా.

"ప్రక్కంటి ఆవిడ చెల్లెలి భర్త చిన్నప్పుడే పోయాడట. అక్క, బావల దగ్గరే ఉంటోంది."

"సందు చివర ఇంట్లో కుర్రాడు బి. ఏ. నాలుగోసారి కూడా తప్పాడు."

"ఈ చివర ఇంట్లో ఆయన కలప వ్యాపారం చేస్తున్నాడు."

"ప్రక్కింటావిడ కడుపుతో ఉన్నట్లుంది...."

రోజుకో కొత్త సంగతి కనుక్కొని చెప్తున్నాడు నాకు. ఇతరుల గురించి వినాలంటే, ముఖ్యంగా ఇలాంటి ఆడవాళ్ళ కబుర్లంటే నాకు విసుగు అయినా వినక తప్పదు. ఎన్నిసార్లు వద్దని వారించినా చెప్పటం మానడు. అసలు చెప్పకుండా ఉండలేడు.

అద్దం ముందు నుంచోని తల దువ్వుకుంటూంటే అడిగాడు. "ఎదురింటి మేడ మీద గదిలో అద్దెకుంటున్నారు ఇద్దరు- చూశావా?"

"చూడలేదు. అవసరం కలగలేదు." అన్నాను వీలయినంత విసుగును ప్రదర్శిస్తూ. లేకపోతే సంభాషణ పొడిగిస్తాడు. ఏదో విశేషం లేకపోతే అడిగి ఉండడు వాళ్ళ గురించి.

నా విసుగుదల చూసి కొంచెం సేపు మాట్లాడలేదు. బూట్లు తొడుక్కుంటుండగా అడిగాడు మళ్ళీ.

"వాళ్ళిద్దరూ ఒకే గదిలో కలసి ఉండటం ఆశ్చర్యంగా లేదూ?"

"ఏం? మనిద్దరం కలసి ఉండటంలేదూ?" అన్నాను.

"మనిద్దరి సంగతి వేరు వాళ్ళిద్దరూ ఆడా, మొగా వయస్సులో ఉన్నారు. నిజంగా విచిత్రంగా లేదూ?"

"ఏ మాత్రంలేదు." కరకుగా సమాధానం చెప్పి. బూటు లేసులు బిగించి. ముడివేసి, బయటకి నడిచాను.

సాయంత్రం కాలేజీ నుంచి తిరిగి రాగానే గదిలో కూర్చుని పేపరు చదువుతున్నాడు దాసు. నేను మొహం కడుక్కొని టేబిల్ ముందు కూర్చున్నాను. ఇంటికి ఉత్తరం రాయడానికి.

"అతను సేల్సుటాక్సు ఆఫీసులో గుమాస్తాగా పని చేస్తున్నాడుట. ఆ అమ్మాయి బి. ఏ చదువుతోంది. మొదటి సంవత్సరం అనుకుంటాను." చెప్పాడు దాసు.

"ఎవరు?" అడిగాను.

"మర్చిపోయావా అప్పుడే? వాళ్ళే, ఎదురింట్లో పైన గదిలో అద్దెకుండేవాళ్ళు."

"అయితే?" అడిగాను.

"అబ్బే' ఏం లేదు. సంధు చివర బి. ఏ తప్పాడన్నానే - అతను చెప్పాడు." అన్నాడు.

"ఇంటికి వుత్తరం రాస్తున్నాను." అన్నాను. ఏమనుకున్నాడో బయటకి వెళ్ళిపోయాడు వెంటనే.

మర్నాడు ఉదయం "వాళ్ళిద్దరి ప్రవర్తనా ఏం బాగాలేదు...." అని చెప్పబోయాడు. నాకు అర్ధమయింది. ఆ వాళ్ళిద్దరూ ఎవరో!

"ఎవరు?" అడిగాను అయినా తెలియనట్లు.

"ఎదురింటి మేడ మీద అద్దెకున్నవాళ్ళు." చెప్పాడు.

"వాళ్ళిద్దరి ప్రవర్తన బాగుండకపోతే ఫర్వాలేదు. నాకు వాళ్ళ విషయంలో ఏ మాత్రం ఇంట్రెస్ట్ లేదు. దయచేసి నాకు మాత్రం చెప్పకు వాళ్ళగురించి...." అన్నాను తీవ్రంగా మొహం ముడ్చుకున్నాడు దాసు.

రెండురోజులదాకా వాళ్ళ విషయం నా దగ్గర ఎత్తలేదు దాసు. రెండురోజుల తర్వాత "ఛీ-ఛీ! సిగ్గూ-ఎగ్గూ లేదు వాళ్ళిద్దరికి. సినిమాలూ, షికార్లూ, ఒకే రిక్షాలో కలసి వెళ్తున్నారు సెకండ్‌షోలకి...." అని ఆగి నా వంక చూశాడు.

కొంచెం సేపు నేనేమయినా సమాధానం చెప్తానేమోనని ఎదురు చూశాడు. నోరు మెదపలేదు నేను.

"అయినా ఆ పెద్దవాళ్ళకి బుద్ధి ఉండక్కర్లా! ఇద్దరూ ఒకే గదిలో ఉంటూంటే ఎలా ఒప్పుకున్నారో!" అన్నాడు కాస్సేపాగి.

నేనేమీ మాట్లాడకుండా, పుస్తకం మూసి లైటార్పి పడుకున్నాను.

"నిద్ర వస్తోందా?" అడిగాడు దాసు.

సమాధానం చెప్పలేదు నేను. కోపం వచ్చినట్లుంది.

"ఛీ-ఛీ! వట్టి బుద్ధావతారం నువ్వు. ఎందుకూ పనికిరావు, లోకంలో ఏం జరుగుతుందో కూడా తెలియదు నీకు. నీకేం పట్టదు." అన్నాడు.

దాసు తత్వం తెలుసు కాబట్టి నాకు బాధ అనిపించలేదు ఆ మాటలు విని.... దాసు నోరు ఎప్పుడూ వాగుతూండాలి. అతను వాగేసి నేను విని,

వూ కొట్టాలి. దాసుకి ముఖ్యంగా చుట్టుప్రక్కల వున్న వాళ్ళ గురించి మాట్లాడుతూంటే తేనె తాగినట్లుంటుంది.

మర్నాడు ప్రొద్దునే లేచి స్నానం చేయగానే. ప్రక్కింటికి వెళ్ళాడు దాసు. ఆవిడకి ఎన్నో నెలో మరిచిపోయి ఉంటాడు. అడగడానికి వెళ్ళి ఉంటాడనుకున్నాను.

వాళ్ళిద్దరూ పెద్దాపురం నుంచి లేచిపోయి వచ్చారుట. ఇక్కడ కాపరం పెట్టారు."

హోటల్‌లో భోజనం చేస్తుంటే మళ్ళీ మొదలు పెట్టాడు దాసు.

ఎప్పటిలాగే మౌనం వహించాను నేను. "మన ప్రక్కింటావిడది పెద్దాపురం దగ్గర ఏదో పల్లెటూరు. ఆవిడ చెప్పింది...." అన్నాడు.

"దయచేసి భోజనం చేసేటప్పుడయినా వాళ్ళను గురించి మాట్లాడకు. ముఖ్యంగా ఇలాంటి విషయాలు. నాకు బాగుండవు." అన్నాను.

"దేనికీ అంత విసుగు? మాట్లాడేది నేనుగా? నోరు మూసుకుని వినడానికేం? నాకేగా నోరు నొప్పి. రేపు నీ ఇంట్లో ఏం జరిగేదీ నీకే తెలియదు."

నాకు నవ్వాలో, ఏడవాలో తెలియలేదు.

"బాగా బరి తెగించారు." అన్నాడు.

"వాళ్ళు పెద్దాపురం నుంచి లేచిపోయి వచ్చారో, చిన్నాపురంనుంచి లేచిపోయి వచ్చారో తెలుసుకుంటే నాకు ఒరిగేది ఏమిటి?" అన్నాను.

సాయంత్రం మళ్ళీ కొత్త సమాచారం సేకరించాడు. ఆ అమ్మాయి క్రిష్టియన్‌ట. అతను బ్రహ్మడు. అతను క్రిష్టియన్ మతం పుచ్చుకుని పెళ్ళి చేసుకుంటాడుట ఆ అమ్మాయిని, కలప వ్యాపారి చెప్పాడుట.

"నీకు చెప్పినా, ఆ గోడకి చెప్పినా ఒకటే." అన్నాడు. నేను ఏం కామెంట్ చేయకపోతే.

o o o

"లోపలికి రావచ్చా?" బయట నుంచునే అడిగాడు మర్యాదగా.

"రండి" అన్నాను బయట నుంచుని ఉన్న వాళ్ళిద్దరివంకా చూసి,

లోపలికి వచ్చారు ఇద్దరూ. ఆమె చేతిలో పసుపు పూసిన కవర్లు శుభలేఖలు అనుకున్నాను.

"మేము మీ ఇంటి ఎదురుగా ఉన్న మేడమీద గదిలో అద్దెకు ఉంటున్నాము." అన్నాడు అతను.

"గ్లాడ్ టు సీ యూ" అన్నాడు మర్యాదగా చెయ్యి చాపాడు అతను. షెక్‌హేండ్ ఇచ్చాను. దానువంక చూచాను. మొహంలో స్పష్టంగా కనిపిస్తోంది ఆశ్చర్యం. నోరు తెరచుకుని ఇద్దరివంకా చూస్తున్నాడు.

"బహుశ మీ పెళ్ళనుకుంటాను." అన్నాను నేను చేతిలో శుభలేఖలు చూస్తూ.

"నాదికాదు. మా చెల్లాయ్ పెళ్ళి. రేపు వూరు వెళ్తున్నాం. ఇంకా వారంరోజులుంది పెళ్ళి. మీరో చిన్న సహాయం చెయ్యాలి" అన్నాడు.

"చెప్పండి" అన్నాను.

"మీరేమి అనుకోకపోతే, దయచేసి నాకు వచ్చే వుత్తరాలు ఈ ఎడ్రసుకు డైరెక్టు చేయాలి."

జేబులోంచి చిన్నకాగితం తీసి అందించాడు. కాగితంమీద ఎడ్రసు చదివాను. పెద్దాపురం కాదు కర్నూలు.

"తప్పకుండా చేస్తాను" అన్నాను.

"థాంక్స్. పోస్టుమెన్‌తో చెప్పాను. నా వుత్తరాలు మీకే ఇవ్వమని. మీకే ఇస్తాడు. ఒక ముఖ్యమయిన ఉత్తరం కోసం ఎదురుచూస్తున్నాను. అందుకనే ఈ ఏర్పాటు, మీకు ఇబ్బంది ఏమీ ఉండదనుకుంటాను." అన్నాడు.

"నా టుపెల్" అన్నాను.

శుభలేఖ అందించాడు. మా పేర్లు అడిగి, కవరుమీద పేరురాసి ఇచ్చాడు దానుకళ్ళు శుభలేఖ మీదకి పరుగెత్తాయి. వెంటనే శుభలేఖ దానుకి అందించి అతనితో అన్నాను.

"కూర్చోండి. నిలబడే వున్నారు" అని.

"ఫర్వాలేదు. థ్యాంక్స్. ఇంక వెళ్తాము" అన్నది ఆమె.

"మీ చెల్లెలు ఏంచేస్తూంటారు?" అడిగాను నేను.

చిన్నగా నవ్వాడు అతను.

"సారీ ఇంకా పరిచయం చేయలేదు కదూ" అన్నాడు.

"ఇతను మా అన్నయ్య. నాదే పెళ్ళి" అన్నది ఆమె కొంచెం సిగ్గుగా, తల వంచుకుని.

"బి. ఏ. సెకండ్ ఇయర్ చదువుతోంది" అన్నాడు అతను.

శుభలేఖ చదువుతున్న దాసు మొహంలో కత్తివాటుకు నెత్తురుచుక్క లేదు. మొహం పాలిపోయింది. నా వంకచూసి, వెంటనే కళ్ళు తిప్పు కున్నాడు.

"కంగ్రాట్స్" అన్నాను ఆమె వంక చూస్తూ.

"థాంక్స్" అన్నది.

"పెద్దాపురం.... పెద్దాపురమా మీది?" అడిగాను.

"పెద్దాపురం! కాదు కర్నూలు అన్నాడు." దాసు తలవంచుకున్నాడు.

"మీరు సేల్సుటాక్సు ఆఫీసులో చేస్తున్నారా?" అడిగాను వెంటనే.

"లేదు. యూనివర్శిటీలో రీసెర్చి చేస్తున్నాను" చెప్పాడు అతను కొంచెం ఆగి...."ఏం అలా అడిగారు?" అన్నాడు.

"ఏం అనుకోకండి. సేల్స్‌టాక్స్ ఆఫీసులో పనిచేసే ఒకతను అచ్చు మీలాగే ఉంటాడు, అందుకని అడిగాను." జవాబు చెప్పాను. దాసు శుభలేఖ చదువుతున్నట్టు నటిస్తున్నాడు.

"మీరు తప్పకుండా రావాలి" అన్నది ఆమె మమ్మల్నిద్దరినీ ఉద్దేశించి.

"అలాగే" అన్నాడు దాసు.

"మీరేం అనుకోకుండా ఉంటే ఓ ప్రశ్న అడుగుతాను." ఆమెవైపు తిరిగి అన్నాను.

"నిరభ్యంతరంగా!" అన్నది.

ఏం అడుగుతానో అన్నట్లుగా చూసాడు దాసు?

"మీరు బొట్టు పెట్టుకోలేదు. క్రిష్టియన్నా?"

సమాధానం చెప్పలేదు ఆమె.

"నేను రోజూ చెప్తూనే ఉంటాను, బొట్టు పెట్టుకోదు, ఫేషన్లు." అన్నాడు అతను.

"సారీ! ఏం అనుకోకండి, ఉరికే అడిగాను." అన్నాడు.

"ఫర్వాలేదు. ఇక నుంచి పెట్టుకుంటాను." అన్నది.

"విష్ యు గుడ్ లక్!" అన్నాడు దాసు.

థాంక్స్ చెప్పి వెళ్ళిపోయారు ఇద్దరూ.

దాసు బొమ్మలా నిల్చుండి పోయాడు. ఏం మాట్లాడాలో తెలియలే దనుకుంటాను.

"దాసూ!" పిల్చాను.

నావంక చూసాడు.

"నువ్వూ, పక్కింటావిడ, బి. ఏ చదివే అతను, కలప వ్యాపారీ మీరంతా కాకులు. కట్ట కట్టుకుని వెళ్ళి గంగలోపడి చావండి!" అన్నాను కోపంగా.

మాట్లాడలేదు దాసు.

"వాళ్ళు నిజంగా పెద్దాపురం నుంచి లేచిపోయి వచ్చినా మన కెందుకు? లోకులు కాకులని వూరికే అనలేదు!" అన్నాను.

(జ్యోతి, సెప్టెంబరు 1971)